నమస్తే తెలంగాణ
నిజామాబాద్
5 | నిజామాబాద్, గురువారం 14 నవంబర్ 2024 | NIZAMABAD

వడ్లు కొనాలని రైతుల ఆందోళన

పాతంగల్, నవంబర్ 13: గోనె సంచులు లేక ధాన్యం కొనుగోలు చేయడం లేదని రైతులు రోడ్డెక్కారు. నిజామాబాద్ జిల్లా పాతంగల్ మండలం కల్లూర్ గ్రామ రైతులు బీర్కూర్-పాతంగల్ ప్రధాన రహదారిపై బుధవారం బైఠాయించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం రోజులవుతున్నా ఇంతవరకూ కాంటాలు మొదలు పెట్టలేదని మండిపడ్డారు. సంచులు లేవని, రేపు మాపు అంటూ ఐదు రోజులుగా తిప్పించుకుంటున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల గ్రామంలో గడ్డివాముకు నిప్పు పెట్టారని, అలాగే ఎక్కడ వడ్ల కుప్పలకు నిప్పుపెడతారేమో అన్న భయంతో కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నామని వాపోయారు. వెంటనే సంచులు తెప్పించి వెంటనే కాంటాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న పాతంగల్ సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శి అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. ఆ తర్వాత సంచులు తెప్పించి కాంటాలను ప్రారంభించిడంతో అన్నదాతలు శాంతించారు.

బీర్కూర్-పాతంగల్ ప్రధాన రహదారిపై బైఠాయించిన రైతులు

కొనుగోలు కేంద్రాల్లో సమస్యల తిష్ట..

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని సమస్యలే నెలకొన్నాయి. తేమ శాతం మిషన్లు సక్రమంగా పని చేయడం లేదని, టార్పాలిన్ కవర్లు, తాలు పట్టే యంత్రాలు ఉండడం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. తూకం వేసిన ధాన్యాన్ని తరలించడానికి వారం రోజులకు పైగానే పడుతున్నదని చెబుతున్నారు. తూకంలో తేడాలు ఉంటున్నాయని, తాలు, తేమ పేరు మీద ఎక్కువ కాంటా చేస్తున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. దొడ్డు రకం ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారులు రూ.1900 నుంచి రూ.2వేల లోపే చెల్లిస్తుండగా, సన్నరకాలకు రూ.2400 నుంచి రూ.2500 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని కేంద్రాల్లో సన్న రకాలను కొనుగోలు చేయక పోవడంతో రైతులు దళారులకు అమ్ముతున్నారు. బాన్సువాడ మండలంలో మొన్నీ మధ్యే రైతులు తేమ శాతం విషయంలో జరుగుతున్న మోసాలపై నిరసిస్తూ ఆందోళనకు దిగారు. కేంద్రాల నిర్వాహకులను నిలదీయడంతో 17 శాతానికి ధాన్యాన్ని కొలిచి తీసుకున్నారు.

అన్నాసాగర్ ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విక్టర్

కల్లాలు దాటని సన్న వడ్లు

దొడ్డు వడ్లకే కాంటాలు

- భారీగా తరుగు తీస్తున్న మిల్లర్లు
- అన్నాసాగర్‌లో ధర్నాకు సిద్ధమైన రైతాంగం
- హుటాహుటిన తరలొచ్చిన యంత్రాంగం
- సమస్యల పరిష్కారానికి హామీ
- సన్నరకాల కొనుగోళ్లు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 13 : వడ్ల కొనుగోళ్లలో తీవ్ర జాప్యం నెలకొన్నది. సన్నరకాలు కాంటా వేయకుండా దొడ్డు వడ్లనే కొంటుండడంపై అన్నదాతలు ఆగ్రహానికి గురయ్యారు. అదే సమయంలో మిల్లర్లు భారీగా కడ్తా తీస్తుండడం, అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో ఆందోళనకు సిద్ధమయ్యారు. అన్నాసాగర్ కొనుగోలు కేంద్రంలో బుధవారం ధర్నా చేయాలని రైతులు నిర్ణయించగా, విషయం తెలిసి యంత్రాంగం పరుగున తరలివచ్చింది. సమస్యలు పరిష్కరించి సన్న వడ్ల కొనుగోళ్లు ప్రారంభించింది.

ఎలారెడ్డి మండల పరిధిలోని అన్నాసాగర్ కొనుగోలు కేంద్రం వద్ద బుధవారం రైతులు ధర్నాకు సిద్ధమయ్యారు. సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయడం లేదు. దొడ్డు రకం వడ్లు సంచికి 1.600 కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నా మిల్లర్లు లోడ్‌కు 5 క్వింటాళ్ల తరుగు తీస్తున్నారు. మరోవైపు లారీల కొరత తీవ్రంగా ఉండడం, లారీలో లోడ్ చేసిన ప్రతీ సంచికి డ్రైవర్ రూపాయి డిమాండ్ చేయడం. మిల్లర్లు కడ్తా విధించడంపై విసిగిపోయిన రైతులు కొనుగోలు కేంద్రం వద్ద ధర్నా చేయాలని గ్రామ వాట్సాప్ గ్రూప్‌లో మెస్సేజ్ పెట్టుకున్నారు. బుధవారం ఉదయమే కొనుగోలు కేంద్రానికి చేరుకుని బైఠాయించేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే ఈ సమాచారం జిల్లా అధికారులకు చేరడంతో అడిషనల్ కలెక్టర్ విక్టర్, అధికారులు ఆగమేఘాల మీద ఉదయమే అక్కడకు చేరుకున్నారు. సన్నబియ్యం కొనకపోవడం, తరుగు తీస్తుండడం, డ్రైవర్ డబ్బులు డిమాండ్ చేస్తుండడంపై రైతులు అధికారులను నిలదీశారు. 'బీఆర్ఎస్ హయాంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండే. కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక అడ్లు అమ్మే తందుకు మస్తు కష్టమైతుందని' కర్షకులు మండిపడ్డారు. అడిషనల్ కలెక్టర్ వారిని బుజ్జగించి ఆయా సమస్యలను పరిష్కరిస్తామని హామీఇచ్చారు. వెంటనే సన్నధాన్యం కొనుగోలును ప్రారంభించడంతో రైతులు శాంతించారు. డీసీవో రామ్మోహన్, డీసీఎస్‌వో నర్సింహారావు, డీఎం రాజేందర్, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ మహేందర్, ఎస్సై బొజ్జ మహేశ్, గిర్దావర్ శ్రీనివాస్ తదితరులు తరలివచ్చారు.

సన్నవడ్లు యాడ అమ్ముకోవాలె..

బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సన్న, దొడ్డు ధాన్యమంతా కొనుగోలు చేసేది. అదే ధీమాతో ఈసారి కూడా సన్న వడ్లు పండించినం. ఇప్పుడిప్పుడే ప్రభుత్వం దొడ్డు వడ్ల కొనుడు మొదలువెట్టింది. మరీ సన్న వడ్లు ఎవరు కొంటరు?. పంట కోసి 20 రోజులు అయిపాయె. వడ్లు అమ్మేదాకా మా బతుకు కల్లాల కాడనే అయితుంది. గింత నిర్లక్ష్యం ఎప్పుడూ సూడలె. అందుకే ధర్నా చేద్దామని డిసైడ్ అయినం. సార్లు వచ్చి సమస్య పరిష్కరిస్తామని చెప్పిండు.

- పెరుగు నాగరాజు, రైతు, అన్నాసాగర్

యాడికాడ దోసుకునుడే..

వడ్లు అమ్ముదామంటే యాడికాడ దోసుకునుడే ఉన్నది. సంచికి కిలో ఆరు వందల గ్రాములు ఎక్కువగా జోకుతున్నారు. అయినా రైస్‌మిల్ సేటు లారీకి ఐదు క్వింటాళ్ల తరుగు తీస్తుండు. ఇగ మేము బాగుపడాలంటే యాడికెళ్లి అయితది. కడ్తాతోని నష్టపోతున్నామని సార్లకు చెప్పిచెప్పి యాష్ట కచ్చింది. రోడ్డు మీదికొస్తేనే పని అయితదని ఆందోళనకు సిద్ధమైనం. విషయం తెలిసి సార్లు ఉరుకొచ్చిండ్రు.

- సంతోష్‌రెడ్డి, రైతు, అన్నాసాగర్

అందరూ మామీద వడి బతుకుడే..

సన్న అడ్లు కొంటలేరని మా బాధల మేము ఉన్నం. దొడ్డు అడ్లు కాంటా వేస్తున్నారు. సంచికి కిలోన్నర కంటే ఎక్కువ జోకుతున్నా మిల్లర్లు ఇంకా తరుగు తీయవట్టే. పుండు మీద కారం సల్లినట్లు లారీ డ్రైవర్ కూడా పైసలు అంటుండు. సంచికి రూపాయి ఇయ్యమని పోరు పెడుతుండు. అందరూ మామీద పడి బతుకుడే. మరీ మేమెట్ల బతకాలె. అడిషనల్ కలెక్టర్ సార్ వచ్చిండని ఊకున్నం. లేకపోతే మస్తు లొల్లి పెట్టాలె అనుకున్నం.

- సాయిబాబా, రైతు, అన్నాసాగర్

'అరి'గోస

- ధాన్యం అమ్ముకోలేక రైతుల అవస్థలు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకోని సేకరణ
- ప్రైవేట్ వ్యాపారుల మాయాజాలం
- కామారెడ్డి జిల్లాలో మిల్లర్ల ఇష్టారాజ్యం
- క్వింటాకు మూడు కిలోలకు పైగా కోత
- లబోదిబోమంటున్న రైతాంగం
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం



నిజామాబాద్, నవంబర్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అటు ప్రభుత్వ నిర్లక్ష్యం, ఇటు మిల్లర్ల ఇష్టారాజ్యం.. నడుమ వరి రైతు చిత్తవుతున్నాడు. సర్కారు వడ్లను సరిగా కొనడం లేదు. మిల్లర్లకు అమ్మితే తరుగు పేరిట దోపిడీకి తెరలేపారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునేందుకు రైతులు నానా తిప్పలు పడుతుంటే, మిల్లర్లేమో క్వింటాకు 3 కిలోల చొప్పున కోత పెడుతున్నారు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. కాంగ్రెస్ పాలనలో పంట పండించడం ఒక ఎత్తయితే, అమ్ముకోవడం మరింత కష్టంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ధాన్యం సేకరణ ఇప్పటికీ ఊపందుకోలేదు. కొన్నిచోట్ల గన్నీ బ్యాగులు లేవు. మరి కొన్ని చోట్ల అసలు కాంటాలే ప్రారంభం కాలేదు.

ఇక, కాంటా వేసిన చోట లారీల లోడింగ్ సమస్య నెలకొంది. రాజకీయ చదరంగంలో మునిగి తేలుతున్న రేవంత్ సర్కారు రైతులను పట్టించుకోవడం మానేసింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ప్రభుత్వ సలహాదారులు, ఎమ్మెల్యేలు కొనుగోలు తీరుపై సమీక్షలు చేయడమే లేదు. మండలాల వారీగా ప్రత్యేకాధికారుల పర్యవేక్షణ లేదు. సర్కారు నిర్లక్ష్యంపై కడుపు మండిన రైతులు రోడ్డెక్కుతున్నారు. గన్నీ బ్యాగులు లేవని, కాంటాలు వేయడం లేదని ఇటీవల పలుచోట్ల రైతులు ఆందోళనకు దిగారు. తాజాగా ఎల్లారెడ్డి మండలంలోనూ బైఠాయించారు.

క్వింటాకు 3 కిలోల కోత..

కామారెడ్డిలో రైస్ మిల్లర్లు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారు. క్వింటాకు 3 కిలోల చొప్పున తరుగు తీస్తూ దోపిడీకి తెర లేపారు. ఎల్లారెడ్డి మండలం అజమాబాద్ కొనుగోలు కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఓ వైపు సన్న వడ్లు కొనకపోవడం, మరో వైపు కొనుగోలు చేసిన వడ్లను లోడింగ్, అన్‌లోడింగ్‌లో జాప్యం చేయడం వంటి సమస్యలతో రైతులు విసుగు చెందుతున్నారు. ఒక్కో రైతు నుంచి క్వింటాకు 3 కిలోలు చొప్పున తరుగు తీయడం మూలంగా ఒక లోడ్ లారీకి దాదాపుగా 5 క్వింటాళ్లకు పైగా కడ్తా పేరిట రైస్‌మిల్లర్లు సొమ్ము చేసుకుంటున్నారు. ఇదంతా పక్కాగా జరుగుతున్నా అడ్డుకట్ట వేయడంలో కామారెడ్డి జిల్లా యంత్రాంగం విఫలమవుతున్నది. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నప్పటికీ, మిన్నకుండిపోతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంటా వేసే సమయంలోనే గన్నీ సంచి పేరిట రెండున్నర కిలోలు తరుగును దోచేస్తున్నారు. కాంటా వేసిన తర్వాత బస్తాలను తరలించే క్రమంలో మిల్లర్లు ఇష్టానుసారంగా రైతుల కష్టాన్ని లాగేసుకోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి మిల్లర్ల దోపిడీ నుంచి కాపాడాలని కర్షకులు కోరుతున్నారు.

విలువలకు నిలయాలు శిశుమందిరాలు

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి వరప్రసాద్

కామారెడ్డి, నవంబర్ 13: శిశు మందిరాలు విలువలు, క్రమశిక్షణ, సంస్కృతి సంప్రదాయాలకు నిలయాలని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. ఇలాంటి విద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు అదృష్టవంతులన్నారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో కామారెడ్డిలోని శ్రీసరస్వతీ శిశుమందిర్‌లో బుధవారం నిర్వహించిన బాలల హక్కులపై అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలలపై హింస, లైంగిక వేధింపులకు పాల్పడితే శిక్షార్హులవుతారని తెలిపారు. టోల్ ఫ్రీ నంబర్ 15100కు ఫోన్ చేసి న్యాయపరమైన సలహాలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, బాలల సంరక్షణ కమిటీ జిల్లా సభ్యురాలు ప్రవంతి, స్వర్ణలత, బార్ అసోసియేషన్ కార్యదర్శి సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగభూషణం, అకాడమిక్ ప్రిన్సిపల్ నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

లంచం కేసులో ఏఈకి రెండేండ్ల జైలు

- రూ.40 వేల జరిమానా విధింపు
- ఏసీబీ ప్రత్యేక కోర్టు తీర్పు

వినాయక్‌నగర్, నవంబర్ 13 : లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన కేసులో ఏఈకి రెండేండ్ల జైలుశిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న ఏసీబీ ప్రత్యేక కోర్టు బుధవారం తీర్పు వెలువరించింది. ఏసీబీ డీఎస్పీ శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. నిజామాబాద్ నగరంలోని బొబ్బిలివీధికి చెందిన బండారి అరవింద్ కాంట్రాక్టర్. ఆయన వేసిన రోడ్డు కొలతలను నమోదు చేసేందుకు మున్సిపల్ అసిస్టెంట్ ఇంజినీర్ పోరెడ్డి అశోక్ రూ.20 వేలు డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని సదరు కాంట్రాక్టర్ ఏసీబీ డీఎస్పీని ఆశ్రయించాడు. అధికారుల సూచన మేరకు మే 29, 2012 రోజున అరవింద్.. అశోక్‌కు లంచం ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ కేసులో ఏసీబీ తరపున నాంపల్లిలోని ఏసీబీ కోర్టులో పీపీ ఏఎల్ మనోజ్ఞ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఏసీబీ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి మహమ్మద్ అఫ్రోజ్ అక్తర్ నిందితుడికి రెండేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. జరిమానా చెల్లించకపోతే ఒకనెల అదనంగా సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు.

బస్సులు రావట్లేదని విద్యార్థుల ధర్నా

బీర్కూర్ మండలకేంద్రంలో రోడ్డుపై ధర్నా చేస్తున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

నస్రుల్లాబాద్, నవంబర్ 13 : సకాలంలో బస్సులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు బీర్కూర్‌లో బుధవారం ధర్నాకు దిగారు. బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న కిష్టాపూర్ గ్రామ విద్యార్థులు బీర్కూర్-పాతంగల్ ప్రధాన రహదారిపై ఆందోళన చేశారు. సకాలంలో బస్సులు రాక పాఠశాలకు ఆలస్యంగా వెళ్తున్నామని, పాఠాలు సరిగా వినలేకపోతున్నామని విద్యార్థులు తెలిపారు. సాయంత్రం సమయంలోనూ బస్సులేక ఇంటికి వెళ్లేసరికి రాత్రి అవుతున్నదని వాపోయారు. బస్సులు రాక రోడ్లపై పడిగాపులు కాయాల్సివస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి సకాలంలో బస్సులు నడపాలని కోరారు.

ప్రజల నమ్మకాన్ని ద్విగుణీకృతం చేద్దాం

న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

- న్యాయార్థుల ఆశయాలకు అనుగుణంగా పని చేయాలి
- కేసుల పరిష్కారంలో మరింత చేయూతనివ్వండి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల పిలుపు

వినాయక్‌నగర్, నవంబర్ 13 : కోర్టుల ద్వారా సత్వర న్యాయాన్ని ఆశిస్తున్న న్యాయార్థుల ఆశలకు అనుగుణంగా మరింత కష్టపడి పనిచేద్దామని జిల్లా జడ్జి సునీత కుంచాల పిలుపునిచ్చారు. ప్రజలు అన్ని రాజ్యాంగ వ్యవస్థల కన్నా ఎక్కువగా న్యాయవ్యవస్థపైనే ఆధారపడతారని, ఆ నమ్మకాన్ని ద్విగిణీకృతం చేద్దామని సూచించారు. బార్ అండ్ బెంచ్ సమన్వయంతో కక్షిదారులకు మెరుగైన న్యాయ సేవలు అందిస్తున్నామని, న్యాయమూర్తులు, న్యాయవాదులు మరింత శ్రమిస్తే మరిన్ని న్యాయ ఫలాలు అందించడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. నిజామాబాద్ బార్ అసోసియేషన్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించిన న్యాయవాదులతో మాట్లాడారు. న్యాయవ్యవస్థ పనితీరులో ఎంతో పారదర్శక ఉన్నదని, దానిని కాలానికి, సమయానికి అనుగుణంగా మార్చుకుని సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించుకుందామన్నారు. సుప్రీంకోర్టు, రాష్ట్ర హైకోర్టు దిగువకోర్టులపై చాలా ఆశలు పెట్టుకున్నాయన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల.. స్థానిక కోర్టుల్లోనే కేసులు పరిష్కారమైతే కక్షిదారులకు ఎంతో మేలు చేసిన వారమవుతామని చెప్పారు. న్యాయవాద సమాజం ప్రజలకు మెరుగైన, సత్వర న్యాయసేవలు అందించేందుకు అవిశ్రాంత కృషి చేస్తున్నదని బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్ తెలిపారు. న్యాయవ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని నిలబెడుతామని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు రాజేందర్‌రెడ్డి చెప్పారు. న్యాయమూర్తులతో పాటు సిబ్బంది కొరత ఉన్నప్పటికీ అనుకున్న దాని కన్నా ఎక్కువగానే కేసులు పరిష్కారమవుతున్నాయన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు ఖుష్బూ ఉపాధ్యాయ్, హరికృష్ణ, హరికుమార్, చైతన్య, బార్ సభ్యులు పాల్గొన్నారు.

గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఘనంగా గిరి ప్రదక్షిణ

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- గోవిందనామ స్మరణతో మార్మోగిన నింబాచలం

భీమ్‌గల్, నవంబర్ 13 : శ్రీమన్నింబాచల లక్ష్మీ నరసింహస్వామి గిరి ప్రదక్షిణకు భక్తులు పోటెత్తారు. గోవింద నామ స్మరణతో నింబాచల గిరులు మార్మోగాయి. వేలాదిగా తరలివచ్చిన మహిళలు భక్తిశ్రద్ధలతో లింబాద్రిగుట్ట ప్రదక్షిణ పూర్తిచేశారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేద పండితులు బుధవారం ఏకాక్షర నృసింహ హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో గిరి ప్రదక్షణ చేశారు. అందంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. గతంలో రాళ్లు, రప్పలతో కూడిన మార్గంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.70 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు వేయడంతో గిరి ప్రదక్షిణకు ఎలాంటి ఆటంకాలు లేకుండా సాగింది.

గుట్టకు ప్రత్యేక బస్సులు

ఖిలీల్‌వాడి, నవంబర్ 13: ఉత్తర తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలకు వచ్చే రద్దీని దృష్టిలో పెట్టుకొని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనున్నది. భక్తుల అవసరాలకు అనుగుణంగా ఆర్మూర్, నిజామాబాద్, ధర్పల్లి, సిరికొండ నుంచి లింబాద్రిగుట్టకు శుక్రవారం నుంచి నాలుగు రోజులపాటు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు ఆర్ఎం జానీరెడ్డి తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, లక్ష్మీనర్సింహస్వామి ఆశీస్సులు పొంది.. సుఖవంతమైన ప్రయాణంతో వారి గమ్యస్థానాలకు చేరాలన్నారు.